# మృగశిరల మధ్య మమతల వెల్లు..

# అడుగడుగునా అబద్ధాల వేట

## ప్రతి అడుగులోనూ భయం.. - ప్రతి చూపులోనూ నైచ్యం..

## ఆడపిల్ల ప్రాణం గాలిలో దీపమేనా? - వికృత చేష్టలకు అడ్డుకట్ట వేసే మగాడు ఎక్కడ?

చంద్రుడిపై అడుగు పెట్టే సాంకేతికతను అందుకున్న ఈ నాగరిక ప్రపంచంలో, నేటికీ ఓ ఆడపిల్ల ధైర్యంగా నడిరోడ్డుపై అడుగు వేయలేకపోతోంది. అభ్యుదయ భావాలు కేవలం ప్రసంగాలకే పరిమితమవుతున్నాయి. సమాజంలో మనిషి వేషంలో తిరుగుతున్న కామపిశాచులకు ఆడపిల్ల ఒక ఆటబొమ్మ గా, ఆమె శరీరం ఒక భోగవస్తువు గా కనిపిస్తోంది. బస్సుల్లో, రైళ్లలో, ఆఖరికి నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూడా ఆడపిల్లలపై జరుగుతున్న అసభ్యకర దాడులు మానవత్వానికే మచ్చగా మారుతున్నాయి.

### కామం కప్పిన కళ్లు.. మచ్చుకైనా లేని మనవత్వం

నేటి కాలంలో అఘాయిత్యం అంటే కేవలం బలాత్కారం మాత్రమే కాదు. కళ్లతో చేసే దాడి, మాటలతో చేసే గాయం, రద్దీని అదునుగా చేసుకుని చేసే స్పర్శ కూడా నేరమే. ఎదురుగా వస్తున్న మహిళను గౌరవించకపోయినా పర్వాలేదు కానీ, ఆమెను ఒక వస్తువులా చూస్తూ కళ్లతోనే నగ్నంగా మార్చే వికృత ధోరణి పెరిగిపోయింది. బస్సులో నిలబడితే తాకాలని చూడటం, లిఫ్టుల్లో అసభ్యంగా ప్రవర్తించడం వంటివి నేడు సర్వసాధారణం అయ్యాయి. తొందరపాటు స్పర్శ అనే పేరుతో కావాలని చేసే ఈ చేష్టలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి.

### ఆడపిల్లలూ.. అప్రమత్తత మీ ఆయుధం

సమాజం మారే వరకు వేచి చూడటం కంటే, మనల్ని మనం రక్షించుకోవడమే నేటి అవసరం. ప్రతి అమ్మాయి కొన్ని జాగ్రత్తలు పాటించక తప్పని స్థితి. అది ప్రమాదవశాత్తూ తగిలిన స్పర్శా లేక కావాలని చేసిన వికృత చేష్టా అనేది మహిళలకు త్వరగా అర్థమవుతుంది. అటువంటి సమయంలో మౌనంగా ఉండటం అంటే నేరగాడిని ప్రోత్సహించడమే. గట్టిగా నిలదీయండి. మొబైల్ ఫోన్లలో అలర్ట్స్, పోలీస్ యాప్స్ (ఉదాహరణకు హక్-ఎ-నిఘా లేదా షి టీమ్ నంబర్స్) ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి. అవసరమైతే పెప్పర్ స్ప్రేలను దగ్గర ఉంచుకోవడం, మార్షల్ ఆర్ట్స్ వంటి ప్రాథమిక రక్షణ విద్యలను నేర్చుకోవడం నేటి కాలంలో అత్యవసరం.

### మగవాళ్లలో మారని తీరు.. నైతికత ఏదీ?

పురుషులార మీ ఇంట్లో ఓ సోదరి, ఓ తల్లి, ఓ భార్య ఉన్నారని మర్చిపోకండి. ఒక అబ్బాయి తప్పు చేస్తే అది వాడి వ్యక్తిగత తప్పు కాదు, ఆ తల్లిదండ్రుల పెంపకంలో ఉన్న లోపం. ఆడపిల్లను చూసినప్పుడు గౌరవం కలగాలే తప్ప, కామం కలగకూడదనే సంస్కారం ఇంట్లోనే మొదలవ్వాలి.

ఎదుటి మహిళ వేసుకున్న బట్టలను బట్టి ఆమె వ్యక్తిత్వాన్ని అంచనా వేయడం మానుకోవాలి. మీ చూపుల్లోని లోపాన్ని ఆమె దుస్తులపై నెట్టడం అత్యంత హేయమైన చర్య.

### నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టేదెప్పుడు?

కఠిన చట్టాలు కాగితాల మీద పదునుగా ఉన్నా, ఆచరణలో మాత్రం మొద్దుబారిపోతున్నాయి.

అన్యాయం జరుగుతుంటే సెల్ ఫోన్ తో వీడియోలు తీస్తూ ఆనందించే జనాభా ఉన్నంత కాలం నేరగాళ్లు భయపడరు. పది మంది కలిసి ఒక నేరస్థుడిని నిలదీస్తే, వాడు ఇంకెప్పుడూ అటువైపు చూడడు. వేధింపులకు పాల్పడే వారికి తక్షణమే బహిరంగ శిక్షలు లేదా కఠినమైన జైలు శిక్షలు పడాలి. న్యాయ ప్రక్రియలో జాప్యం నేరగాళ్లకు వరంలా మారుతోంది.

స్వేచ్ఛ అంటే అర్ధరాత్రి తిరగడం మాత్రమే కాదు..

ఏ సమయంలోనైనా భయం లేకుండా బతకగలగడం. ఆడపిల్ల ఆటబొమ్మ కాదు, ఈ విశ్వానికి మూలం. ఆమె కళ్లలో భయం పోయి, ధైర్యం కనిపించిన రోజే అసలైన ప్రజాస్వామ్యం సిద్ధిస్తుంది. మగవారి మనస్తత్వాల్లో మార్పు, ఆడవారిలో ఆత్మస్థైర్యం, సమాజంలో బాధ్యత.. ఈ మూడు కలిస్తేనే భయం లేని సమాజం సాధ్యం.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
సెల్ నంబర్ 9701249103